సాక్షి
రాజన్న సిరిసిల్ల

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న 10 కోడెలను జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలం ముగ్దం తండాకు చెందిన గోశాలకు అందజేశారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరిసిల్లక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. సిరిసిల్లలో సోమవారం ట్రాఫిక్ నియంత్రణను పరిశీలించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. తెల్లవారుజామున ఈదురుగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

నిరాశవాది తనకు వచ్చిన అవకాశంలో కష్టాన్ని చూస్తే, ఆశావాది కష్టంలో అవకాశం కోసం వెతుకుతాడు.
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6.33	బుధ 4.42





సిరిసిల్లలో పరీక్ష కేంద్రం వద్ద రద్దీ



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



తనిఖీ చేస్తున్న సిబ్బంది



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

‘పది’ పరీక్షలు ప్రారంభం

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజన్నసిరిసిల్ల జిల్లాలో సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగాయి. జిల్లావ్యాప్తంగా 6,493 మంది విద్యార్థులు రెగ్యులర్ విధానంలో పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోగా 6,487 మంది హాజరయ్యారు. ప్రైవేటుగా ఏడుగురు విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా ఐదుగురు పరీక్ష రాశారు. ఇల్లంతకుంట మండలంలోని రెండు కేంద్రాలతోపాటు మండలంలో మరో రెండో పరీక్ష కేంద్రాలను డీఈవో సందర్శించారు.

పోలీసు పోస్టింగుల కాలం!

- నేతల లేఖల కోసం ఖాకీల ప్రదక్షిణలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న పైరవీలు
- ఏసీపీ నుంచి ఎస్సైల దాకా బదిలీల కోసం యత్నాలు
- ప్రతిభావంతులకే పట్టం కట్టే పనిలో ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పోలీసుల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరో ఐదారు నెలల్లో రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సమరం జరగబోతున్న నేపథ్యంలో ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలు పూర్తిచేసింది. ఇక తరువాత స్థాయిలో ఉన్న ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్‌– ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారుల బదిలీలపై కొంతకాలంగా హోంశాఖ కసరత్తు చేస్తోంది. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్ కమిషనరేట్, రామగుండం కమిషనరేట్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో కిందిస్థాయిలో ఎస్సైల బదిలీలు ఇప్పటికే మొదలయ్యాయి. ఇక కీలకమైన సీఐ, ఏసీపీల బదిలీల విషయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎవరిని ఎక్కడ నియమించాలన్న విషయంలో ఇటు ఉన్నతాధికారులు, అటు హోంశాఖ పకడ్బందీగా ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం అధికారుల ట్రాక్ రికార్డుతోపాటు, సమర్థతపై ఫోకస్ పెట్టినట్లు సమాచారం.

మూడేళ్ల నిబంధన కీలకం..!

క్రితంసారి జరిగినట్లుగా ఈసారి అసెంబ్లీ ఎన్నికలు వన్‌సైడ్‌గా జరిగే అవకాశాలు చాలా తక్కువ. అధికార పార్టీకి ప్రతిపక్ష పార్టీల నుంచి మునుపటి కంటే పోటీ అధికంగా ఉండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో ఎన్నికలలో సున్నితమైన, కీలకమైన నియోజకవర్గాల్లో ప్రతిభావంతులైన అధికారులకు పోస్టింగులు ఇవ్వాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ నియామకాన్ని రద్దు చేస్తూ.. కేంద్రం ఆయన్ని ఏపీ కేటాయించింది. దీంతో ప్రభుత్వం డీజీపీ విషయంలోనూ ఆచితూచి వ్యవహరించి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలే అప్పగించింది. ప్రస్తుతం కేంద్రం–రాష్ట్రం మధ్య పరస్పర రాజకీయ ఆధిపత్య పోరు తీవ్రమైన నేపథ్యంలో పోస్టింగుల విషయంలో ఎక్కడా సాంకేతిక పరమైన లోపాలు, పొరబాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే.. ఇటీవల జరిగిన ఐఏఎస్, ఐపీఎస్‌ల విషయంలోనూ జాగరుకతతో వ్యవహరించింది. ఇందులో భాగంగానే.. కరీంనగర్ సీపీగా సుబ్బారాయుడు, రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి, సిరిసిల్ల ఎస్పీగా అఖిల్‌మహాజన్, జగిత్యాల ఎస్పీగా భాస్కర్‌లను నియమించి మొత్తం ఉమ్మడి జిల్లా పోలీసు బాసులను ఏకకాలంలో మార్చింది. ఎన్నికల కమిషన్ నిబంధన ప్రకారం.. గత ఎన్నికల సమయంలో పనిచేసిన రెవెన్యూ, పోలీసు అధికారులు లేదా మూడేళ్లకు మించి ఒకే కుర్చీలో విధులు నిర్వహిస్తోన్న పోలీసులకు స్థాన చలనం తప్పేలా లేదు. ఈ విషయంలో ఇప్పటికే కొన్నిస్థానాల్లో ఎస్సై ర్యాంకు ఆఫీసర్లను ఉన్నతాధికారులు మార్చారు కూడా.

లేఖల కోసం ఏసీపీలు, సీఐల పైరవీలు..!

రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం డీఎస్పీల జాబితాను ఇప్పటికే తెప్పించుకుంది. అదే సమయంలో కరీంనగర్, రామగుండం కమిషనరేట్లతోపాటు సిరిసిల్ల, జగిత్యాల పోస్టింగుల కోసం పలువురు డీఎస్పీలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముఖ్యంగా చాలాకాలంగా పోస్టింగులు లేకుండా లూప్‌లైన్లలో ఉంటున్న అధికారులు తమకు తెలిసిన నాయకుల ద్వారా ఈసారి ఎలాగైనా పోస్టింగ్ దక్కించుకోవాలని నేతల లేఖలు సంపాదించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు సైతం తాము పనిచేసే నియోజకవర్గం, జిల్లాను కుదిరితే జోన్ సైతం మారేందుకు వెనకాడటం లేదు. తమకు తెలిసిన నాయకుడు ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా సరే.. వెళ్లి వెంటనే చేరిపోతున్నారు. ఇదే రకంగా ఇప్పటికే పలువురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు జోన్లు మారి మరీ విధుల్లో జాయినయ్యారు.

కరీంనగర్‌లో విచిత్రం..!

కరీంనగర్ కమిషనరేట్ విషయానికి వస్తే.. ఇక్కడ పోలీసుల తీరు విచిత్రంగా ఉంటుంది. ఇక్కడే ఎస్సైలుగా సర్వీసులో చేరిన కొందరు ఇప్పటికీ ఏసీపీలుగా కొనసాగుతున్నారు. వీరికి బదిలీ గండం వెంటాడుతుండటంతో లూప్‌లైన్‌లోకి వెళ్లాలా? లేక అలవాటు ప్రకారం.. ఐదారు నెలలు మరో ప్రాంతానికి బదిలీపై వెళ్లి.. సరిగ్గా ఎన్నికల ముందు తిరిగి రావాలా? అన్న ఆలోచనలో ఉన్నారు. మొత్తానికి కరీంనగర్‌ను వదిలేందుకు వీరంతా ససేమీరా అంటున్నారు. అందుకే.. ఏ చిన్న అవకాశం దొరికినా.. దాన్ని సద్వినియోగపరచుకుని ఇక్కడే రిటైర్ అవ్వాలని కంకణం కట్టుకున్నారు.

అమ్మో..! ఆ నియోజకవర్గమా?

ఉమ్మడి జిల్లాలో మూడు జిల్లాల్లో విస్తరించిన ఓ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించాలంటే సిఫారసు లేఖలు తప్పనిసరి. వాటితో విధుల్లో చేరిన పోలీసులను ఇప్పటికీ సిఫారసు లేఖలు ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ముఖ్యంగా ఆ నియోజకవర్గంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు 10 నెలలు డ్యూటీ చేసిన అనంతరం మరో అధికారికి ఆ స్థానంలో లేఖలు ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంలో ఇప్పటికే పలువురు ఎస్సై, సీఐలు చేతులు కాల్చుకున్నారు. తాజాగా కూడా ఈ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని సమాచారం. ఇటీవల కూడా జరిగిన బదిలీల్లోనూ ఇలాగే తమకు అన్యాయం జరిగిందని కొందరు, జరగనుందని మరికొందరు పోలీసులు బాధపడుతున్నారు. ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ విభాగం ఇప్పటికే సీఎం కార్యాలయానికి సైతం చేరవేసిందని సమాచారం. అందుకే.. ఆ నియోజకవర్గం పేరు చెబితేనే.. పోలీసులు బెంబేలెత్తిపోతున్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయికి జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టులు



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత నెలలో కళాశాల నుంచి 12 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపించినట్లు తెలిపారు. ఇందులో 7 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికవడంపై ఆయా ప్రాజెక్టుల విద్యార్థులను, అధ్యాపకులను కళాశాల బృందం వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అఫ్సారి ఉస్మాని, మధు రాజేశ్, వెంకటేశ్వర్లు, మల్లారెడ్డి, రమాదేవి, ప్రభాకర్, రాజేశ్, శ్రీనివాసులు, నారాయణ, నర్సయ్య అభినందించారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ఏకలవ్య, మరిమడ్ల గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో–ఆర్డినేటర్ డీఎస్ వెంకన్న సోమవారం ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 9వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న డీఈవో రమేశ్

ఇల్లంతకుంట(మానకొండూర్): విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో రమేశ్ కోరారు. స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలను సోమవారం పరిశీలించారు. తొలి రోజు తెలుగుపరీక్ష ఎలా రాశారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా మార్కులు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులందరూ అన్ని పరీక్షలు బాగా రాసేలా చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ శిరీష ఉన్నారు.

‘మమ్ములను ఆదుకోండి’



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ నక్సలైట్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జనజీవన స్రవంతిలో కలిసిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ పి.సదానందంను సోమవారం పలువురు మాజీ నక్సల్స్ కోరారు. ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ విప్లవ పార్టీ(సీపీఐఎంఎల్–జనశక్తి)లో పనిచేసి జనజీవన స్రవంతిలో కలిశామన్నారు. మాజీ నక్సలైట్లకు ఇళ్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మకాలనీలోని సర్వే నంబర్ 377లో ఒక్కొక్కరికి 5 గుంటల భూమిని కేటాయించాలని కోరారు. నక్క విజయ్, గడగోని సాగర్, వావిలాల సాయికుమార్ వినతిపత్రం అందించారు.

ఆస్తిపన్నుపై రాయితీ

సిరిసిల్లటౌన్: ఆర్థిక సంవత్సరం ఆరంభం సందర్భంగా ఈనెల 30వ తేదీలోపు ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించే వారికి పన్నుమొత్తంలో ఐదు శాతం రాయితీ వర్తిస్తుందని సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నల్లా బిల్లులు, ఇతర బిల్లులు సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

తిరుగుబాటువీరుడు దొడ్డి కొమురయ్య

- కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు



కలెక్టరేట్‌లో నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: తిరుగుబాటు వీరుడిగా, తెలంగాణ తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో నిలిచిపోతారని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. అరుణ మాట్లాడుతూ భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం పోరాడిన యోదుడు దొడ్డి కొమురయ్య అన్నారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవో పవన్‌కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి మోహన్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి వై.కొండల్‌రావు, డీపీఆర్వో ఎం.దశరథం, జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు మిరాల భాస్కర్‌యాదవ్, నేరెళ్ల సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌గౌడ్, జిల్లా యాదవ సంఘం నాయకులు బండ నర్సయ్యయాదవ్, గోద యాదగిరియాదవ్, వీరవేణి మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేములవాడలో ఠాణా దివస్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఠాణాదివస్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ వస్తున్నారని, మండలంలోని ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు. జిల్లాలో మొట్టమొదటి ఠాణాదివస్‌ను ఇక్కడ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యలతో పరిష్కారం కాకుండా ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను నేరుగా విని వాటి పరిష్కారానికి మార్గం చూపేందుకు ఈ సమావేశం ముఖ్య ఉద్దేశమన్నారు. ఠాణాదివస్‌పై పల్లెల్లో ఆటోల ద్వారా ప్రచారం చేస్తున్నారు.



రాజన్న దర్శనం.. జన్మపావనం

వేములవాడ: రాజన్నను సోమవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం రద్దీగా మారింది. కోడెమొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.

మెరుగైన నీటి సరఫరాకు సబ్‌డివిజన్లు

- నాలుగు సబ్‌డివిజన్ల ఏర్పాటు
- నలుగురు డీఈఈలు

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో మెరుగైన సాగునీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొత్తగా నాలుగు సబ్‌డివిజన్లను ఏర్పాటు చేస్తూ కరీంనగర్ ఎల్‌ఎండీ ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో నీటి పారుదలలో తలెత్తే సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయి.

సబ్‌డివిజన్‌ల స్వరూపం ఇదీ..

సిరిసిల్ల కేంద్రంగా ఇప్పటి వరకు డీఈఈ ఉండగా, ఏఈఈ అధికారిగా నీటిపారుదలశాఖలో మండల స్థాయిలో పనిచేశారు. నూతనంగా సబ్‌డివిజన్‌లుగా ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల, గంభీరావుపేటను ఏర్పాటు చేశారు. సిరిసిల్ల డీఈఈగా సత్యనారాయణను నియమించారు. డీఈఈ పరిధిలో ఇద్దరు ఏఈఈలు 115 చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్వహణ చూసుకుంటారు. ఎగువమానేరు ప్రాజెక్టు కింద సాగయ్యే 598 ఎకరాల పర్యవేక్షణ ఉంటుంది.



నామాపూర్‌లోని సబ్‌డివిజన్ కార్యాలయం

- ఎల్లారెడ్డిపేట డీఈఈగా ప్రశాంత్‌కుమార్ నియామకం కాగా.. ముగ్గురు ఏఈఈలను కేటాయించారు. వీరు 243 చెరువులను పర్యవేక్షిస్తారు.
- ముస్తాబాద్ డీఈఈగా రవికుమార్‌ను నియమించగా.. ఇక్కడ ఇద్దరు ఏఈఈలు పనిచేస్తారు. 58 చెరువులు, చెక్‌డ్యామ్‌లతోపాటు మల్లన్నసాగర్, ఎగువమానేరు కాల్వలను పర్యవేక్షిస్తారు. పెండింగ్ పనుల ప్రతిపాదనలు చేయనున్నారు. ఎగువ మానేరు కింద ఉన్న 8,602 ఎకరాలు పర్యవేక్షిస్తారు.
- గంభీరావుపేట డీఈఈగా నర్సింగ్ కొనసాగుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఏఈఈలను నియమించారు. 59 చెరువులతోపాటు ఎగువమానేరు ప్రాజెక్టు, కెనాల్‌తోపాటు మల్లన్నసాగర్, తొమ్మిదో ప్యాకేజీ పనులు పర్యవేక్షిస్తారు. 3,885 ఎకరాలకు సాగునీరందించే పనులు చూస్తారు.

కార్యాలయాలు కరువు

- సబ్ డివిజన్‌లకు ప్రస్తుతం కార్యాలయాలు లేవు. ముస్తాబాద్ మండలం నామాపూర్‌లోని నిజాం కాలం నాటి సెక్షన్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. గంభీరావుపేటకు నర్మాలలోని భవనం పాడుబడింది. ఎల్లారెడ్డిపేటలో భవనాలు లేవు. అద్దె భవనాలలో కార్యాలయాలను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

అడవికి ఆపద

- రక్షణ చర్యలు కరువు
- పూర్తికాని ఫైర్‌లైన్స్ ఏర్పాటు పనులు
- జిల్లాలో 27వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం
- వేసవి సమీపించిన ఊపందుకోని పనులు



అడవిలో ఆకులను ఏరివేస్తున్న కూలీలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పచ్చని అటవీకి ఆపదొచ్చింది. ఆకురాలే కాలం కావడంతో దట్టమైన అడవిలోని పల్చగా మారుతోంది. ఆకులురాలి నేలపై పేరుకుపోయాయి. ఇప్పుడిప్పుడే ఎండలు ముదురుతున్నాయి. అయినా అటవీ అధికారులు మంటల నివారణ చర్యలు ఊపందుకోలేదు. అటవీ ప్రాంతంలో మంటలు విస్తరించకుండా నివారించేందుకు ఏటా ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేస్తారు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్న అటవీ మొత్తానికి విస్తరించకుండా నివారించగలవు. ఈ పనులు ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి చేయలేకపోయారు.

27వేల హెక్టార్లలో అటవీ..

జిల్లాలోని 27వేల హెక్టార్‌లలో అడవి విస్తరించి ఉంది. ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, చందుర్తి, రుద్రంగి, ఇల్లంతకుంట మండలాల్లో అత్యధికంగా అడవులు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో వన్యప్రాణులు ఆవాసాలుగా చేసుకుని జీవిస్తున్నాయి. దుప్పులు, చిరుతలు, అడవిపందులు, కుందేళ్లు, జింకలు, మనుబోతులు, ముళ్లపందులతోపాటు నెమళ్లు సంచరిస్తుంటాయి. ఈక్రమంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుంటే రోడ్ల వెంట ప్రయాణించే ఆకతాయిలతోపాటు అడవిలో పశువులు, గొర్రెలకాపరులు సిగరెట్లు, చుట్ట తాగుతున్న క్రమంలో దాని నుంచి నిప్పురవ్వలు పడి అడవులు దహించుకుపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆకతాయిలైతే ఏకంగా అడవులకే నిప్పుపెట్టగా.. పెద్ద ఎత్తున మంటలు వ్యాపించి విలువైన సంపదకు అపార నష్టం కలుగుతోంది.

195 కిలోమీటర్లు లక్ష్యం

- సిరిసిల్ల, వేములవాడ రేంజ్‌ల పరిధిలో 12 సెక్షన్లు, 44 బీట్లలో కలిపి 27 హెక్టార్‌ల అటవీ ఉంది. జిల్లాకు చెందిన అడవులు జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలకు చెందిన అడవితో కలిసి ఉంటాయి.
- ఆకురాల్చే అడవులు కావడంతో మంటలు చెలరేగకుండా ఏటా ఫైర్‌లైన్లు ఏర్పాటు చేస్తుంటారు.
- ఒక మీటర్‌కు రూ.6 ఖర్చు చేస్తూ డబ్బా ఆకారంలో 100 మీటర్ల చొప్పున ఫైర్‌లైన్స్ వేస్తారు. ఒకవేళ మంటలు అంటుకున్న అక్కడికే పరిమితమై అడవికి నష్టం జరుగకుండా ఉంటాయి.
- జిల్లాలో ఈ ఏడాది 195 కిలోమీటర్ల ఫైర్‌లైన్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.
- గ్రామాలలో హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. వనాలు దగ్ధంకాకుండా వేసవిలో బీడీల తయారీకి ఉపయోగించే ఆకు, ఇప్పపూలు సేకరించేందుకు, నేలపై పడిన ఆకులను కూలీలతో ఏరివేయిస్తున్నారు.
- అడవిలోని రాళ్ల రాపిడికి మంటలు ఎగిసిపడే ప్రమాదాలు ఉన్నాయి. దానిని శాటిలైట్, గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకుని అధికారులు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేస్తున్నారు. చాలా సంఘటనల్లో అధికారులు ప్రమాదస్థలికి వెళ్లేలోపే మంటలు వ్యాప్తిచెందుతున్నాయి. వాటిని అదుపు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

వేగంగా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేస్తాం



జిల్లాలో రెండు రేంజ్‌ల పరిధిలో 27 హెక్టార్లకు పైగా అడవి విస్తరించి ఉంది. అడవులకు నష్టం జరుగకుండా ఫైర్‌లైన్లను ఏర్పాటు చేస్తాం. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వాతావరణం ఫైర్‌లైన్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. ఈ ఏడాది 195 కిలోమీటర్ల ఫైర్‌లైన్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటి వరకు 50శాతం వరకు పూర్తి చేశాం. త్వరలోనే పనుల్లో వేగం పెంచి వెంటనే పూర్తి చేస్తాం.

– శ్రీనివాసరావు, ఎఫ్‌ఆర్వో, సిరిసిల్ల

క్లుప్తంగా

బోయినపల్లి ఎస్సైగా మహేందర్



బోయినపల్లి: బోయినపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా మామిడి మహేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించరు. డీఐజీ కార్యాలయం నుంచి మహేందర్‌కు బోయినపల్లి ఠాణాలో పోస్టింగ్ ఇచ్చారు. గత నెల 18న సీసీఎస్ నుంచి అటాచ్‌డ్ బోయినపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన బోయిని పర్శరాం తిరిగి సీసీఎస్‌కు వెళ్లారు.

కొదురుపాక పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్వాస్ బృందం



పీహెచ్‌సీలో ఎన్‌క్వాస్ బృందం

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని కొదురుపాక పీహెచ్‌సీని సోమవారం ఎన్‌క్వాస్ ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్ టీం సభ్యులు ప్రహ్లాద్ అంబదాస్ గుంజాల్, మస్త జైస్వాల్ సందర్శించారు. పీహెచ్‌సీ పరిసరాలు, నిత్యం ఓపీ ఎంత మంది వస్తున్నారు. వైద్యసేవలు ఇమ్యునైజేషన్, మందుల వివరాలు, ఇతర రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. రెండ్రోజులు పీహెచ్‌సీలో తనిఖీలు చేపట్టనున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. డీఐఓ డాక్టర్ మహేశ్, డీపీవో ఉమ, పీహెచ్‌సీ వైద్యాధికారి రేణు ప్రియాంక, క్రిష్ణవేణి, జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్, తదితరులున్నారు.

బస్సులో నుంచి జారిపడ్డ వృద్ధురాలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): కదులుతున్న బస్సులో నుంచి జారిపడ్డ వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన తంగళ్లపల్లిలో సోమవారం జరిగింది. సిద్దిపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడకు వెళ్తోంది. తంగళ్లపల్లి మూలమలుపు వద్ద బస్సులో నుంచి ఎనుగంటి కౌసల్య జారిపడగా.. ఆమె తలకు గాయాలయ్యాయి. వెంటనే బస్సును ఆపిన డ్రైవర్ అదే బస్సులో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు గోడకూలి మహిళ మృతి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఆరె దేవవ్వ(36) ఇంటి ప్రహరీ కూలి మృతిచెందింది. దేవవ్వ సోమవారం తన ఇంటి ప్రహరీని ఆనుకుని ఇసుక పోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు గోడ తల్లీకూతుళ్లపై కూలింది. ఊపిరి ఆడక అపస్మారకస్థితికి వెళ్లిన ఇద్దరిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. దేవవ్వ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. కూతురు అక్షయ(16)కు గాయాలయ్యాయి. మృతురాలి భర్త నర్సయ్య దినసరి కూలి.

విన్నపాలు వినవలే..

- ప్రజావాణికి వెల్లువెత్తిన వినతులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు భారీగా తరలివచ్చారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, పరిష్కరించాలని సూచించారు. వివిధ సమస్యలపై 23 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్,ఖీమ్యానాయక్, ఆర్డీవో పవన్‌కుమార్ ఉన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

గూడు కల్పించండి



మాది రాజీవ్‌నగర్. కొన్నేళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. నా భర్త ఆరేళ్ల క్రితం కింద పడడంతో నడుము విరిగింది. అప్పటి నుంచి ఏ పని చేయలేక మంచానికే పరిమితమయ్యాడు. మాకు వచ్చే పెన్షన్ డబ్బులతో బతుకుతున్నాం. ప్రస్తుతం వృద్ధాప్యంతో బాధపడుతున్న మాకు ఎవరు అద్దెకు ఇల్లు ఇవ్వడం లేదు. అధికారులు దయచేసి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేసి, ఆదుకోవాలి. – వంగ వెంకటలక్ష్మి, లింగం

డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి



కంటి వెలుగు రెండో విడతలో డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల కోసం జిల్లాలో దాదాపు 350 మంది నిరుద్యోగులం దరఖాస్తు చేసుకున్నాం. ఉద్యోగాల నియామకం విషయంలో ఎలాంటి స్కిల్ టెస్ట్ నిర్వహించకుండా, అకాడమీ మెరిట్ పట్టించుకోకుండానే డీఎంహెచ్‌వో తన అనుయాయులను నియమించుకున్నారు. దీంతో 350 మంది నిరుద్యోగులు అర్హతలు ఉన్నా ఉద్యోగాలకు నోచుకోలేదు. ఈ విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమంగా నియమించిన డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి. – బాధితులు

సమస్యలు పరిష్కరించండి



మాది వేములవాడ మండలం మారుపాక. మా ఊరిలో వైకుంఠధామం నిర్మించి ఐదేళ్లు గడుస్తున్నా నిరుపయోగంగానే ఉంది. పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. గ్రామపంచాయతీ పరిధిలో అక్రమ వెంచర్లు ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా క్రీడామైదానం ఊరికి దూరంగా నిర్మించారు. యువకులకు ఉపయోగపడడం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలి. – మారుపాక గ్రామస్తులు

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి (చొప్పదండి): బీఆర్‌ఎస్‌పై సోషల్ మీడియాలో ప్రతిపక్ష పార్టీలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలకేంద్రంలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ చిక్కాల సుధాకర్ రావు, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, ఆర్బీఎస్ అధ్యక్షుడు కొనుకటి లచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య
- సిరిసిల్లలో పార్టీ ఆత్మీయ సమ్మేళనం

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో సుమారు 60 లక్షల సభ్యత్వాలతో బీఆర్‌ఎస్ జాతీయ పార్టీగా ప్రజాదరణ పొందుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఉంటూ.. వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పట్టణంలో ప్రణాళికాబద్ధంగా వార్డుల వారీగా ఆత్మీయ సమేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 5న రేణుకా ఎల్లమ్మ ఫంక్షన్‌హాల్‌లో 1, 2, 3, 4, 5, 6, 12, 13, 14, 27 వార్డులకు కలిపి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోట ఆగయ్య

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

- టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట (సిరిసిల్ల): ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో పోషణ అభియాన్‌లో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ టీచర్ల అందిస్తున్న ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. జెడ్పీటీసీ విజయ గర్భిణులకు చీరెలను కానుకగా అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సీడీపీవో అలేఖ్య పటేల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సంతోష, వైస్ ఎంపీపీ దోసల లత, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.



సామూహిక సీమంతాల్లో టెస్కాబ్ చైర్మన్

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ముందు జాగ్రత్తలు తప్పనిసరి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ముందుజాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో అగ్నిమాపక అధికారులతో సోమవారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరిగే హైరిస్క్ ప్రాంతాలను గుర్తించి ఫైర్ సేఫ్టీ ఉండేలా చూడాలన్నారు. మున్సిపాలిటీల్లో కమిషనర్లు, మండలాల్లో తహసీల్దార్లు ఫైర్ సేఫ్టీపై తనిఖీలు చేయాలని సూచించారు. వాణిజ్య భవనాలు, హోటల్స్, లాడ్జీలు, ఆస్పత్రులు, పరిశ్రమలు, సినిమా థియేటర్లు, పెట్రోల్‌బంక్స్, ఫంక్షన్‌హాల్స్, ఆలయాలు, జనం రద్దీ ఉండే ప్రాంతాల్లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, లూజ్‌వైర్లను గుర్తించాలని సూచించారు. అంతకు ముందు జిల్లా అగ్నిమాపకాధికారి టి.వెంకన్న అగ్ని ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఫైర్‌సేఫ్టీ తనిఖీల్లో చూడాల్సిన అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కలెక్టర్లు సత్యప్రసాద్, ఖీమ్యానాయక్, మున్సిపల్ కమిషనర్‌లు సమ్మయ్య, అన్వేశ్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవోలు, ×సెస్× పోలీస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయాలి

తంగళ్లపల్లి, నేరెళ్ల, సుందరయ్యనగర్, వేములవాడ పీహెచ్‌సీల పరిధిలో వంద శాతం మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆరోగ్య మహిళ కార్యక్రమంపై సమీక్షించారు. మహిళలకు అవసరమైన అన్ని పరీక్షలు చేసి, వారికి అవసరమైన మందులు అందించాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని మున్సిపల్ కార్మికులకు, ఏఎన్‌ఎంలకు, ఆశవర్కర్లకు, గ్రామైక్య సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ కోరారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, ఉప జిల్లా వైద్యాధికారి శ్రీరాములు, రజిత పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ అనర్హత వేటుపై నిరసన

సిరిసిల్ల టౌన్ : కేంద్రంలోని బీజేపీ నేతలు ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతూ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కే.కే.మహేందర్‌రెడ్డి ఆరోపించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో టార్చ్‌లైట్ కాగడాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మోదీ సర్కారు ఆదానీకి దోచిపెడుతున్న దేశ సంపదపై ప్రశ్నిస్తున్నందునే రాహుల్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్‌కు జరిగిన అన్యాయంపై పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని హెచ్చరించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ గౌడ్, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామునివనిత, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జాలుగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో..

సిరిసిల్ల టౌన్ : రాహుల్‌గాంధీపై అనర్హత వేటును నిరసిస్తూ యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనాథ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సోమవారం స్థానిక గాంధీచౌక్‌లో పోస్టల్‌కార్డుల ద్వారా ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్‌పై అనర్హత వేటు అప్రజాస్వామ్యమని యావత్ దేశ ప్రజలు కాంగ్రెస్ తరపున పోరాటం చేస్తున్నారన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాయకులు చొప్పదండి ప్రకాశ్, చిందం శ్రీనివాస్, సతీశ్‌కుమార్, భాను, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్‌ఎస్‌లో ‘మజీద్ కమిటీ’ ముసలం

- మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో వాగ్వాదం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిపై ముస్లిం నేతల గుస్సా
- సర్దిచెప్పిన పార్టీ నేతలు

సిరిసిల్ల: బీఆర్‌ఎస్ పార్టీ నేతల మధ్య ‘మజీద్ కమిటీ’ ఎన్నికల ముసలం పుట్టింది. సిరిసిల్లలోని మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లోనే సోమవారం ఆ పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మజీద్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన ముస్తఫాకు మద్దతు ఇస్తున్నారని ముస్లిం నాయకులు ఆరోపించారు. మజీద్ కమిటీ నిబంధనల మేరకు పదోతరగతి పాస్ అయిన అభ్యర్థి మాత్రమే ఎన్నికల్లో పోటీ చేయాల్సి ఉండగా.. ముస్తఫా ఫేక్ సర్టిఫికెట్‌తో నామినేషన్ వేసి గెలిచారని ఎండీ సలీం వర్గం ఆరోపిస్తుంది. దీనిపై మజీద్ కమిటీలో చర్చ సాగుతుంది. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ముస్తఫాకు మద్దతుగా ఉన్నారని, ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని సలీం పేర్కొన్నారు. దీనిపై సిరిసిల్లటౌన్ పోలీసులకు తోట ఆగయ్య ఫోన్ చేసి ఎందుకు చెప్పాల్సి వచ్చిందని ప్రశ్నించారు. నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు బీఆర్‌ఎస్ మద్దతుగా ఉన్నామని సలీం, సత్తార్ పేర్కొన్నారు. దీనిపై బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్రమైన వాగ్వాదం జరిగింది. ముస్లిం నాయకులు, కొందరు సిరిసిల్ల పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు సైతం తోట ఆగయ్య తీరును తప్పుపడుతూ మాట్లాడడం చర్చనీయాంశమైంది.



మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో బీఆర్‌ఎస్ నాయకుల వాగ్వాదం

అందరి ముందే వాగ్వాదం

టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, మైనార్టీ నాయకుల సమక్షంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో వాగ్వాదం జరిగింది. దీనిపై ఆయన ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని మైనార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి ఇంట్లో మరో వర్గంతో మీటింగ్ పెట్టావని నిలదీశారు. దీనిపై ఇది పవిత్ర రంజాన్ మాసం.. నేను ఎవరితోనూ మీటింగ్ పెట్టలేదు.. అది తప్పు అని ఆగయ్య వివరణ ఇచ్చారు. మొత్తానికి సిరిసిల్లలో మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీస్‌లో బీఆర్‌ఎస్ నాయకుల మధ్య ఉన్న అభిప్రాయ బేధాలు బయటపడ్డాయి. మజీద్ కమిటీ ఎన్నికల ఫలితాలు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిపై ఆగ్రహానికి కారణమైంది. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సర్దిచెప్పే ప్రయత్నాలు ఫలించలేదు. మజీద్ కమిటీ నిబంధనల మేరకు ముందుకు వెళ్లండి.. అందులో బీఆర్‌ఎస్ పార్టీ జోక్యం చేసుకోదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు సర్దిచెప్పారు. కానీ అంతకుముందు జరిగిన వాగ్వాదం ఆ పార్టీ నేతల మధ్య అంతర్గత కలహాలు బయటపడ్డాయి.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

వేములవాడరూరల్ : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీవో ఎల్లయ్య అన్నారు. మండలం మల్రిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఏశ తిరుపతి హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. సర్పంచ్ కట్కం మల్లేశం, సఖి కేంద్రం ఇన్‌చార్జి రోజా, ఐసీడీఎస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచుల ఫోరం అధ్యక్షుడు తిరుపతి

ఒకరి అరెస్టు



రేగుల గోపికృష్ణ

వేములవాడ : పోలీసులపై దురుసుగా ప్రవరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. వేములవాడలో ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులపై తాగిన మైకంలో దురుసుగా ప్రవర్తించిన పట్టణంలోని ముదిరాజ్ వీధికి చెందిన రేగుల గోపికృష్ణను అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై చర్చించాలి

వేములవాడ : ఎస్సీల వర్గీకరణపై పార్లమెంట్‌లో చర్చించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్‌కు మహజన్ సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి అవునూరి ప్రభాకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, గుండా థామస్, వెంకటేశ్, విజయేందర్, మేకల బాబు, నేదూరి బాబు, నర్సయ్య, కుమ్మరి దేవయ్య, హరీశ్, తదితరులున్నారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యా యత్నం

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో పనిచేసే సల్మాన్‌రాజ్ అనే సెక్యూరిటీ గార్డు సోమవారం ఆత్మహత్యా యత్నానికి యత్నించాడు. మార్కెట్‌యార్డులో పనిచేసే ఉద్యోగి నిత్యం వేధింపులకు గురిచేస్తున్నాడని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు బాధితుడు తెలిపాడు.

మజీద్ కమిటీ అధ్యక్షుడికి నోటీస్



మాట్లాడుతున్న అబ్దుల్ వహీద్

సిరిసిల్ల టౌన్ : నూతనంగా ఎన్నికైన సిరిసిల్ల మజీద్ కమిటీ అధ్యక్షుడు ముస్తాఫాను పదవి నుంచి తొలగించేందుకు నోటీస్ ఇచ్చినట్లు ఎన్నికల అధికారి అబ్దుల్ వహీద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం జరిగిన మజీద్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి, మహ్మద్ ముస్తాఫా, ఎండీ సలీం ఇద్దరు నామినేషన్లు దాఖలు చేశారని, ముస్తాఫా అందించిన టెన్త్ సర్టిఫికెట్ నకిలీ సర్టిఫికెట్‌గా రుజువైందన్నారు. మజీద్ కమిటీని తప్పుదోవ పట్టించిన అతనిని పదవినుంచి ఎందుకు తొలగించరాదో వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చినట్లు వెల్లడించారు.

ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు

సిరిసిల్ల: జిల్లాలో అధికారికంగా మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో దళిత సంఘాల నాయకులు, అధికారులతో సోమవారం సమీక్షించారు. ఏప్రిల్ 5న డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని, ఏప్రిల్ 14న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొనేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీడీవో మోహన్‌రావు, దళిత సంఘాల నాయకులు రాగుల రాములు, అంకని భాను, కంసాల మల్లేశం, ఆవునూరి వెంకటరాములు, బొడ్డు నారాయణ, లింగంపల్లి శంకర్, మదన్‌లాల్, గొట్టె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



దళిత నాయకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి మృతి



రాజయ్య (ఫైల్)

మేడిపెల్లి (వేములవాడ) : కోరుట్ల– జగిత్యాల ప్రధాన రహదారిపై మేడిపెల్లి మండలకేంద్రం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలం నూకపల్లికి బెజ్జంకి రాజయ్య (53) మెట్‌పల్లి మున్సిపాలిటీలో టౌన్ మిషన్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం బైక్‌పై స్వగ్రామం నుంచి మెట్‌పల్లికి విధులకు వెళ్తున్నారు. మండలకేంద్రం శివారులోకి చేరుకోగానే అతివేగంతో వచ్చిన లారీ రాజయ్య బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ షేక్ హైమద్ మద్యం మత్తులో వేగంగా లారీ నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. సునీత ఫిర్యాదు మేరకు ఎస్సై సుధీర్‌రావు కేసు నమోదు చేయగా కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రంగంపేటలో ‘బలగం’ ప్రదర్శన

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని రంగంపేటలో సర్పంచ్ నందగిరి లింగం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి బలగం సినిమాను ప్రదర్శించారు. బంధాలు, బంధుత్వాల విలువలను తెలుపుతూ ఉన్న బలగం సినిమాను చూసేందుకు గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.



సినిమా చూస్తున్న గ్రామస్తులు

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం.. పొరండ్ల గ్రామంలో ఊర చెరువు సీసీ కాలువ నిర్మాణాన్ని ఆక్రమించుకొని అక్రమంగా గోడ నిర్మించారని సోమవారం కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ఊర చెరువు నుంచి నీరు వెళ్లేందుకు గతంలో చిన్ననీటి పారుదల శాఖ అధికారులు సీసీ కాలువ నిర్మించారు. దీంతో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి భర్త అక్రమంగా సీసీ కాలువపై ప్రహరీ నిర్మించారని, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. నిర్మాణ పనులు పూర్తి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాన్ని తొలగించడంతో పాటు దీనికి వత్తాసు పలికిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.